మనవూరెళ్దాం పద. నాదగ్గిరో బ్రిలియంటైడియా ఉంది. పూర్తిగా మన్దికాదనుకో. దాన్దేవుంది. చేసుకుంటే సరి. మరేంకాదు. ఎక్సుపిక్చర్సువారి నెక్స్ట్ పిక్చర్కి కథ లేకుండానే ఏణ్ణర్ధంనాడు షూటింగారంభించేశారు. ఏదో ఆవేళ మంచిరోజు గదా అని, హీరోయినూ ఆవేళ కాల్షీట్లు కాన్సిలై కాళీగా ఉన్నదనిన్నీ, అందుకు తగ్గట్టే దగ్గిరే వున్న స్టుడియోలో సెట్టొకటి కాళీగా పడుందనిన్నీ గమనించి ప్రొడ్యూసరుగారు ఉత్సాహపడ్డాడు. వారి బ్రదరిల్లా ఇంజనీరు. సెలవులకొచ్చాళ్ళే. ఊరికే అలా ఒడుద్దా యిలా ఆడపిల్ల వెనకట నోరెళ్లబెట్టుకూర్చోపోతే ఇదేదో కామెరా ఎదర అఘోరిస్తే సరిపోనుగా, డైరెక్షను చేసినట్టూ ఉంటుంది, పిక్చరూ ఓటి తయారవుతుందీ అన్నాడు. అతనూ సరే అన్నాడు సరే అంటే సరే అనుకున్నారంతా. వెంటనే ఓషియానికులో కవిగార్ని ఫోనులో పిలిచి అర్జెంటుగా ఓ కథ చెప్పమన్నాం. వెయ్యి రూ॥లు అడ్వాన్సడిగాడు. మనిషికిచ్చి పంపాం, అదందుకోగానే ఇవాల్టికి లవ్రుసీను తీసెయ్యండి. రేపోమాపో కథ చెబుతాను ఆవటాని, అక్కడికి పనికొచ్చే డైలాగులు రెండు ఫోనుమీదే చెప్పేశాడు. సరే పిక్చరారంభమైంది. ఆతరవాతడపాతడపా కాస్తో కూస్తో కథ చెబుతూ రావడం, వీళ్లు షూటింగు తీస్తూ రావడం జరిగింది. కథ ఊహాతామరలా సాకేస్తోంది. కారెక్టర్లు కుచేల సంతానంలా, బాల్నాగమ్మలో గంధోళిగాడి పిల్లల్లా, డబ్బున్నవాడింట బంధుమిత్రుల్లా పెరిగిపోయాయి.

